క్లుప్తంగా

నేడు రైతుబజార్‌కు సెలవు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ రైతుబజార్‌కు బుధవారం సెలవు ఉంటుందని రైతుబజార్ ఈఓ స్రవంతి తెలిపారు. ప్రతి నెల మూడవ బుధవారం సెలవు ఉన్నందున రైతుబజార్‌లో ఎలాంటి క్రయవిక్రయాలు జరగవన్నారు. గురువారం మళ్లీ యథావిధిగా రైతుబజార్‌లో క్రయ విక్రయాలు ప్రారంభం అవుతాయన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఓల్డ్‌మలక్‌పేటలో ఘనంగా ఎల్లమ్మ కల్యాణం



కల్యాణోత్సవంలో పాల్గొన్న కమిటీ సభ్యులు

చాదర్‌ఘాట్: ఓల్డ్‌మలక్‌పేట మహంకాళీ ఆలయంలో మంగళవారం ఎల్లమ్మ కల్యాణం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఓల్డ్‌మలక్‌పేట ఉత్సవాల కమిటీ చైర్మన్ చౌకి రవికుమార్, ఆలయ కమిటీ సభ్యులు విజయ్, అశోక్, శ్రీనివాస్, శివాజీ, మహేష్, నాగరాజు, జయమ్మ, ప్రసన్నలక్ష్మి, మార్కెట్ కమిటీ సభ్యులు రవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒలింపిక్ రన్

లింగోజిగూడ: అంతర్జాతీయ ఒలింపిక్ దినోత్సవాన్ని పురస్కరించుకొని రంగారెడ్డి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం ఒలింపిక్ రన్ నిర్వహించనున్నట్లు అసోసియేషన్ అధ్యక్షుడు మల్లారెడ్డి తెలిపారు. ఒలింపిక్ రన్ నాలుగు దిక్కుల నుంచి మొదలై సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం చేరుకుంటాయన్నారు. ఒకటి హయత్‌నగర్ నుంచి వనస్థలిపురం, ఎల్బీనగర్ మీదుగా సరూర్‌నగర్ స్టేడియం, రెండోది సరూర్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి సరూర్‌నగర్ స్టేడియం, మూడోది కొత్తపేట ఇందిరాగాంధీ విగ్రహం నుంచి సరూర్‌నగర్ స్టేడియం, నాలుగోది సిరిస్ కాలనీ అల్లూరి సీతారామరాజు విగ్రహం నుంచి సరూర్‌నగర్ స్టేడియంకు చేరుకుంటాయని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, క్రీడా అభివృద్ధి సంస్థ చైర్మన్ ఆంజనేయగౌడ్ పాల్గొంటారన్నారు.

'హర్ ఘర్ యోగా'ను విజయవంతం చేద్దాం

మన్సూరాబాద్: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మన్సూరాబాద్ పెద్ద చెరువు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన యోగా షెడ్డులో హర్ ఘర్ యోగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు, సమీప కాలనీల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. పెద్దచెరువు ప్రాంగణంలో మంగళవారం సమీప కాలనీవాసులు, యోగా గురువు భరత్ భూషణ్‌తో కలిసి ఆయన యోగా చేశారు. బుధవారం ఉదయం 5.30 గంటలకు పెద్దచెరువు ప్రాంగణంలో యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల కాలనీలవాసులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అనంతరం చెరువు పరిసరాల్లో మొక్కలు నాటారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

హుడాకాంప్లెక్స్: సరూర్‌నగర్ విద్యుత్ డివిజన్ పరిధిలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం ఉంటుందని డివిజనల్ ఇంజినీర్ కృష్ణయ్య తెలిపారు. ఇందిరానగర్ 11కేవీ ఫీడర్ పరిసర ప్రాంతాలు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, ఆదర్శనగర్ ఫీడర్ పరిధి నాగోల్ మూసీ, అల్కాపురి, అరుణోదయ నగర్ రోడ్డు నెంబర్ 1 నుంచి 8 వరకు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు, సిరీస్ ఫీడర్‌లో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, శివపురి కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.



బల్కంపేట ఎల్లమ్మ గుడివద్ద జరిగిన అమ్మవారి కల్యాణోత్సవ సంబురాల్లో పాల్గొన్న మలక్‌పేట సైదాబాద్‌కు చెందిన ఆనంద్ పోతరాజు

'కార్పొరేట్'కు దీటుగా సర్కారు బడులు

- ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు
- విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హస్తినాపురం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించి.. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్యను అందించాలనే మహోన్నతాశయంతో ప్రభుత్వం మన ఊరు మన బడి, మన బస్తీ మన బడి పథకాన్ని ప్రారంభించిందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా హస్తినాపురంలోని నందనవనంకాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి మాట్లాడుతూ... తొలివిడతలో రూ. 3497.62 కోట్లతో రాష్ట్రంలోని 9,123 స్కూళ్లను 12 అంశాలను ప్రాతిపదికగా తీసుకొని ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామని, రూ. 190 కోట్లు ఖర్చు చేసి 30 లక్షల విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందజేస్తున్నామన్నారు. రాష్ట్రంలో మొదటిసారిగా రూ. 60 కోట్లు వెచ్చించి 6 నుంచి 10వ తరగతి చదువుతున్న 12.39 లక్షల మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్నామని సుధీర్‌రెడ్డి వెల్లడించారు. రెండు లక్షల మంది ఇంటర్ విద్యార్థులకు రూ. 10 కోట్లతో ఉచితంగా పాఠ్య పుస్తకాలను అందజేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 26 లక్షల మంది విద్యార్థులకు రూ. 150 కోట్లు వెచ్చించి ఒక్కొక్క విద్యార్థికి రెండు జతల యూనిఫామ్‌లను అందజేస్తామన్నారు. విద్యారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషిచేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎల్బీనగర్ సర్కిల్ డీసీ సురేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ హస్తినాపురం డివిజన్ అధ్యక్షుడు ఆండోజు సత్యంచారి, నాయకులు గజ్జెల మధుసూదన్‌రెడ్డి, నారగోని శ్రీనివాస్‌యాదవ్, రఘుమారెడ్డి, డేరింగుల కృష్ణ, ఆదిలక్ష్మి, లక్ష్మీప్రసన్న, బాలం ఈశ్వర్, కంచర్ల శివారెడ్డి, నల్ల నాగిరెడ్డి, అనిత, అరుణ్, చారి, ఉమామహేశ్వర్, సురేందర్‌రెడ్డి, సత్యప్రకాశ్, భానుప్రకాశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రావు, రజితమ్మ, రాజు, విద్యావతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యాదినోత్సవం

మన్సూరాబాద్: మన్సూరాబాద్ చంద్రపురికాలనీలోని తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్షియల్ కళాశాలలో ప్రిన్సిపాల్ వినీల ఆధ్వర్యంలో విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి అంబేద్కర్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కె.మఖ్బూమ్ మోహినొద్దీన్, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ ముఖ్య అతిథులుగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చన్నారు. వ్యాసరచన, వివిధ రకాల పోటీలో ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులను అందజేశారు. విద్యార్థినులకు ప్లేట్లు, దుప్పట్లు, కేసీఆర్ కిట్స్, నోట్‌బుక్స్, టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ రవికుమార్, వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

మన్సూరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో...

మన్సూరాబాద్ చౌరస్తా సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యాదినోత్సవ వేడుకల సందర్భంగా కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి జాతీయ జెండాను ఆవిష్కరించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు సరిత, శ్రీనివాస్, రజిత, సుమతిరెడ్డి, నాయకులు పాతూరి శ్రీధర్‌గౌడ్, నవీన్‌గుప్తా, ఉదయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో నాణ్యమైన విద్య

మలక్‌పేట ఎమ్మెల్యే బలాల



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల, డిప్యూటీ ఈఓ రాధాకృష్ణ

మలక్‌పేట: సర్కారు బడుల్లో సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నారని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మలక్‌పేట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మన బస్తీ–మన బడి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆధునీకరించిన పాఠశాల భవనాన్ని, డిజిటల్ తరగతి గదిని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ... జీహెచ్‌ఎంసీ, విద్యాశాఖ నిధులు కలుపుకొని మొత్తం రూ. 40 లక్షలతో మెరుగైన సౌకర్యాలు, డిజిటల్ తరగతి గది, తరగతి గదుల్లో ఫర్నిచర్ ఏర్పాటు చేశామన్నారు. ఎమ్మెల్యే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లను అందజేశారు. అక్బర్ బాగ్ కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్ విద్యార్థుల తల్లిదండ్రులను సన్మానించారు. విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైదాబాద్ మండల డిప్యూటీ ఈఓ తిరునగరి రాధాకృష్ణ, పాఠశాల హెచ్‌ఎం, హిమాయత్‌నగర్ మండల డిప్యూటీ ఈఓ విజయలక్ష్మి, ఇన్‌చార్జి హెచ్‌ఎం నర్సరాజు, జీహెచ్‌ఎంసీ ఈఈ పీర్‌సింగ్, ఏఈ వెంకన్న, ప్రాజెక్టు కోఆర్డినేటర్ రజిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



జగన్నాథ రథయాత్రను ప్రారంభిస్తున్న ఆలయ ఈఓ శ్రీనివాస శర్మ

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీ జగన్నాథ బలభద్ర స్వామి, సుభద్రా సమేత ఆలయంలో మంగళవారం స్వామివారికి ఆలయ అర్చకులు అభిషేకాలు, అర్చనలు ఘనంగా నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ జగన్నాథ రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసశర్మ, హరినామ్ ప్రచార సమితి ఆచార్యులు త్రిదండి శ్రీ భక్తి సౌరభ్ నారాయణ, పాలక మండలి మాజీ చైర్మన్ ఈశ్వరమ్మ, మధుసాగర్, ఆలయ అర్చకులు, సిబ్బంది, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిత్యం యోగాతో పరిపూర్ణ ఆరోగ్యం



యోగా చేస్తున్న విద్యార్థులు

చంపాపేట: నిత్యం యోగా చేస్తే పరిపూర్ణ ఆరోగ్యం పొందటంతో పాటు మానసిక శక్తి పెరుగుతుందని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మంగళవారం చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో యోగా తరగతులను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు సుశిక్షితులైన యోగా గురువు సమక్షంలో నిత్యం ఓ గంట పాటు యోగా చేస్తే రోగ నిరోధక శక్తి, ఆత్మస్థైర్యం, జ్ఞాపక, సంకల్ప శక్తితో పాటు శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. పాఠశాల కరస్పాండెంట్ లలిత, ఉపాధ్యాయులు శ్రీనివాస్, నర్సింహా, అనిత, అవీనా, యోగా గురువు సుర్వి రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి



కార్మికులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: రాష్ట్రంలో కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, అన్నారు. మంగళవారం కొత్తపేటలోని బాబు జగ్జీవన్ రాం భవన్‌లో రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర 10వ వార్షిక మహాసభకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వం కార్మికులకు అండంగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరుపున మంజూరైన చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, రాష్ట్ర కార్మిక సంక్షేమ సంఘం అధ్యక్షుడే సాల్వాచారి, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, కోశాధికారి ప్రవీణ్ కుమార్, ప్రశాంత్, పాషా, పృథ్వీ, కార్మిక సంఘాలు, బీఆర్ఎస్, ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జూలై 2న ఆన్‌లైన్ క్విజ్ పోటీలు

మలక్‌పేట: రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు జూలై 2తేదిన నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మలక్‌పేట ఇంచార్జి చేకోలేకర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 18న జరగాల్సిన పోటీలు అనివార్యకారణాలతో జూలై 2 తేదీకి మార్చినట్లు తెలిపారు. మూసారంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేటలోని ఇంటర్, డిగ్రీ, పీజీ కాలేజీలలో మంగళవారం క్విజ్ పోటీలపై ప్రచారం చేశారు. విద్యార్థులతో కలిసి ×ఆన్‌లైన్ క్విజ్ పోటీల వాల్‌పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... క్విజ్ పోటీలు పూర్తిగా ఉచితమని, ఆసక్తి కలిగిన వారు జూలై 1 తేదీలోగా తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ వెబ్ లింక్‌తో కూడిన ఎస్ఎంఎస్ పొందడానికి ఆసక్తి కలిగిన వారు 7661 899 899 సెల్ నంబర్‌కు మిస్‌కాల్ ఇవ్వాలని కోరారు. నాయకులు మహేష్, సూర్య ప్రకాశ్, సాయిరామ్, శివ పాల్గొన్నారు.

నాలాతో వరద ముంపునకు చెక్

చంపాపేట: చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ చౌరస్తా నుంచి స్వామి వివేకా విగ్రహ చౌరస్తా వరకు ప్రత్యేక భూగర్భ డ్రైనేజీ ఏర్పాటు చేయటం వల్ల లోతట్టు కాలనీల మరుగు పరుగు, వరద ముంపు సమస్యకు ఇట్టే చెక్ పడుతుందని కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కర్మన్‌ఘాట్‌లో రూ. 70 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులతో ప్రారంభించిన భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు అవినాష్‌రెడ్డి, శ్రీధర్‌గౌడ్, వేణుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

చంచల్‌గూడ: గుట్టు చప్పుడు కాకుండా ఇంట్లో మద్యం విక్రయిస్తున్న వ్యక్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన సైదాబాద్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... ఐఎస్ సదన్ డివిజన్ సింగరేణి కాలనీలో సక్రు(40) అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. అతని నుంచి 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

బోనాలకు నిధులివ్వాలని కార్పొరేటర్ వినతి



దేవాదాయ శాఖ ఏసీకి వినతపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: బోనాల జాతరను ఘనంగా నిర్వహించేందుకు అమ్మవారి ఆలయాలకు నిధులను మంజూరు చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి కోరారు. ఈ మేరకు దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బాలాజీకి మంగళవారం వినతిపత్రాన్ని సమర్పించారు. గత సంవత్సరం కన్నా ఈ ఏడాది నిధులు పెంచాలని కోరినట్లు కార్పొరేటర్ తెలిపారు. నేతలు మధుసూదన్‌రెడ్డి, మండడి సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా యోగా దినోత్సవం

మలక్‌పేట: మూసారంబాగ్ శాలివాహననగర్ సెయింట్ థామస్ హైస్కూల్‌లో మంగళవారం యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఇమ్మానుయేల్ యోగాపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యోగా దైనందిన జీవితంలో ఓ భాగం కావాలన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక ఎదుగుదలతో పాటుగా వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందన్నారు. విద్యార్థులు రకరకాల యోగా ఆసనాలు వేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుప్రియ, లక్ష్మీప్రసన్న, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా చేస్తున్న సెయింట్ థామస్ హైస్కూల్ విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలో దశాబ్ది ఉత్సవాలు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సలామ్ షాహిద్

చంచల్‌గూడ: చంచల్‌గూడలోని కాలేడేరా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉందని చావణీ కార్పొరేటర్ సలాం షాహిద్ అన్నారు. మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన దశాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. అంతకుముందు నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించారు. పది సంవత్సరాలుగా పాఠశాలలో ఉచిత కరాటే శిక్షణ ఇస్తున్న ఉద్యకారుడు అక్రమహుల్లాను ఉపాధ్యాయులు సన్మానించారు. విద్యార్థులు తమ ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమ్మాజీ, జయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

25న మున్నూరుకాపు వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ఆధ్వర్యంలో ఈనెల 25న కాచిగూడలోని మున్నూరుకాపు భవన్ మ్యాడం అంజయ్య హాల్‌లో మున్నూరుకాపు వివాహ పరిచయ వేదికను నిర్వహిస్తున్నట్లు మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. కాచిగూడలోని మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా యువతి, యువకులు ఈ వివాహ పరిచయ వేదికలో పాల్గొని వివాహ సంబంధాలు కుదుర్చుకోవాలని సూచించారు. మంచి సంబంధాలు కుదరడం సమస్యగా మారిన నేటి కాలంలో స్వచ్ఛందంగా నిర్వహిస్తున్న పరిచయ వేదికల ద్వారా సులభంగా సంబంధాలను కుదుర్చుకోవచ్చని తెలిపారు. ఇలాంటి వేదికల ద్వారానే ఆయా కుటుంబాల నేపథ్యం, వధూవరుల గుణగణాలు కూడా అవగతమవుతాయని చెప్పారు. ప్రతి యేటా మహాసభ ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదికలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వివాహ పరిచయ వేదిక చైర్మన్ గోపాల రాధాకృష్ణ, కొమ్ము శ్రీనివాస్, లింగిసెట్టి హనుమంతరావు, మణికొండ రమేష్ కుమార్, కొండూరు వినోద్ కుమార్, కొంతం సురేష్‌బాబు, ప్యాట రవీందర్, శ్రీకాంత్, సదానంద్, అనిల్ కుమార్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధంగా ఉండాలి

కాచిగూడ: ఎన్నికలు ఎప్పుడొచ్చినా ఎదుర్కొనేందుకు పార్టీ కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు పిలుపునిచ్చారు. మంగళవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన బీజేపీ అంబర్‌పేట నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. బీజేపీకి కంచుకోట లాంటి అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని అన్నారు. ఈనెల 21న జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్పొరేటర్లు కన్నె ఉమా రమేష్‌యాదవ్, వై.అమృత, పార్టీ నేతలు బి.వెంకట్‌రెడ్డి, శ్యామ్‌రాజ్, సి.నందకిషోర్‌యాదవ్, వనం రమేష్, చిట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

బీసీ బంధును వెంటనే అమలు చేయాలి

కాచిగూడ: బీసీల అభ్యున్నతికి, సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రకటించిన బీసీ బంధును వెంటనే అమలు చేయాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ కుల వృత్తులపై ఆధారపడ్డ లక్షలాది మంది పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. దళిత బంధు కింద ఒక్కో ఎస్సీ కుటుంబానికి రూ.10 లక్షలు ఇస్తున్న ప్రభుత్వం రాష్ట్రంలోని 130 బీసీ కులాలకు రూ.లక్ష ఇవ్వకుండా కేవలం 14 కులాలకే ఇస్తామనడం అన్యాయమన్నారు. నిర్ణీత గడువు లేకుండా రాష్ట్రంలోని 130 బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నేతలు డాక్టర్ ప్రశాంత్, భూషణ్, భాస్కర్, శివనాగేశ్వర్‌రావు, నిత్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఔత్సాహిక రంగాల్లో రాణించాలి



పాఠ్య పుస్తకాలను అందజేస్తున్న దృశ్యం

ఎల్బీనగర్: ఉన్నత శిఖరాలను అధిరోహించలంటే ప్రణాళికాబద్ధంగా విద్యాభ్యాసం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఆశక్తి ఉన్న రంగాన్ని ఎంచుకొని ఆయా రంగాల్లో రాణించాలని బీఎన్ రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, జీహెచ్‌ఎంసీ హయత్‌నగర్ సర్కిల్ డీసీ మారుతీ దివాకర్ అన్నారు. సాహెబ్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన విద్యా దినోత్సవ కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను, యూనిఫారంలను అందజేశారు. అనంతరం ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లీలారాణి, రాధాకృష్ణ, ఉపాధ్యాయులు కృష్ణ, రజిత, రజిని తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి పెద్దపీట



జైపురికాలనీ పాఠశాలలో విద్యార్థులకుపుస్తకాలు అందజేస్తున్న శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ అరుణ



కొత్తపేట పాఠశాలలో ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా



మోహన్‌నగర్ పాఠశాలలో కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తున్నదని టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా నాగోలు జైపురికాలనీ ప్రాథమిక పాఠశాలలో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నాగోలు కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

కొత్తపేట హైస్కూల్‌లో....

కొత్తపేట హైస్కూల్‌లో విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా, మాజీ కార్పొరేటర్ల వజీర్ ప్రకాష్‌గౌడ్, జీవీ సాగర్‌రెడ్డి పాల్గొన్నారు. కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ–మన బడి కింది నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు.

మోహన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో...

కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్ ప్రైమరీ పాఠశాలలో దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ పాల్గొన్నారు. పాఠశాలలో నూతన లైబ్రరీని ప్రారంభించారు. విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఆంజనేయులు, నాయకులు కొత్త తిరుమల్, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.